www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025
5
అన్నమయ్య



ఎఎస్‌పిగా మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే బాధ్యతల స్వీకరణ


ఎఎస్‌పిని అభినందిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఎఎస్‌పిగా మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై నేరుగా తనకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. పోలీసులను కలవడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేదన్నారు. ప్రజలు వారి సమస్యలను నేరుగా ఆయన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని, డిఎస్‌పి సుధాకర్ సహకారంతో రాజంపేట డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు వారి సమస్యలను నేరుగా తన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.

ఎంఎస్‌ఎంఇ ఉన్నట్లా..లేనట్లా.!

- ఇరకాటంలో కూటమి ఎమ్మెల్యేలు
- అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణేదీ?
- గండికోట అదనపు పరిహారం చెల్లింపులేవీ
- నేడు మైదుకూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు

కొప్పర్తి ఎంఎస్‌ఎంఇ పార్కును తరలిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒను ఉపసంహరించుకున్నట్లా..లేనట్లా అనేది తెలియడం లేదు. నార్కోటిక్స్‌డ్రగ్స్ కోర్టును తిరుపతికి తరలించడాన్ని కూటమి ఎమ్మెల్యేలను జిల్లా ప్రజానీకం నిలదీస్తోంది. జిల్లా కేంద్రమైన కడపలో స్ట్రోమ్‌వాటర్ డ్రెయిన్లు, రాజోలు, జొలదరాశి ప్రాజెక్టులు, అన్నమయ్య పునరుద్ధరణ పనులు చేపడతామనే హామీలు అమలుకు ఆమడదూరంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనుల పునరుద్ధరణ, కొప్పర్తి పైప్‌లైన్, హజ్‌హౌస్ పెండింగ్ పనులు, బుగ్గవంక సుందరీకరణ, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీ పనుల్లో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఏడు నెలల కింద ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు శనివారం మైదుకూరు పర్యటన నేపథ్యంలో కథనం...


మైదుకూరులో సిఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/చాపాడు

జిల్లా ప్రగతి తిరోగమనబాట పట్టింది. రాష్ట్రంలో కూటమి సర్కారు రివర్స్‌గేర్‌లో సాగుతోంది. కొప్పర్తికి కేటాయించిన ఎంఎస్ ఎంఇఇ నాలెడ్జ్ పార్కు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం, ఎన్‌డిఎస్‌పి కోర్టును తరలించడంపై ప్రజాగ్రహం చాపకింద నీరులా సాగు తోంది. జిల్లాకు కొత్తగా పరిశ్రమలు ఇవ్వకపోయినా ఉన్న సంస్థలను వాటిని తరలించడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. చెన్నూరు సుగర్ పరిశ్రమ పునరు ద్ధరణ, జెఎస్‌డబ్ల్యు కంపెనీ ఉక్కు పరిశ్రమ, జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనుల్లో ఎటువంటి పురోగతీ కనిపించడం లేదు. 2007లో వైఎస్ఆర్ సర్కారు హయాం లో రూ.72 కోట్లతో కడపలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ కోల్డ్‌స్టోరేజీకి పరిమితమైంది. ఫలితంగా వర్షాకాలంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ నీటిలో మునకలు వేస్తుండడం పరిపాటిగా మారింది. రూ.70 కోట్ల విలువైన స్ట్రోమ్ డ్రెయిన్ల ఏర్పాటు హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. ఏటా కురుస్తున్న వర్షాల ధాటికి కడప నగరం మునుగుతోంది. స్ట్రోమ్‌డ్రెయిన్ కాల్వల ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపట్టడానికి ఇచ్చిన హామీ ఓ మూలకు పరిమితమైంది.

అద్దెగదుల్లోనే ఆర్కిటెక్చర్ చదువులు

రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ అద్దె గదుల్లోనే కాలం గడుపుతోంది. ఐదేళ్లుగా స్థలం ఎంపిక, శంకుస్థాపన దశకే పరిమితమైంది. ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నిర్మాణం ఎప్పటికి సాకారమవుతుందో తెలియని దుస్థితి నెలకొంది. రూ.12కోట్లతో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు.

కొప్పర్తి పైప్‌లైన్ ప్రశ్నార్థకమే!

రూ.150 కోట్ల కొప్పర్తి పైప్‌లైన్ సాకారానికి నోచుకోవడం లేదు. నీటి కొరత, పర్యావరణ అనుమతుల కారణంగా పారిశ్రామిక పురోగతి పడకేసింది. కొప్పర్తిలోని వైఎస్ఆర్ క్లస్టర్లో ఏర్పాటు చేసిన పరిశ్రమల అవసరాలకు సరిపడా నీటి సదుపాయం అందడం లేదు. కడప, ప్రొద్దుటూరు పాల పరిశ్రమల కార్యకలాపాలు ప్రశ్నార్థకంగా మారాయి. ప్రొద్దుటూరులో మూతన పడిన పాలపరిశ్రమ ఆస్తుల తనఖా పెట్టిన నేపథ్యంలో సుమారు రూ.90 కోట్లు చెల్లింపులకు నోచుకోకపోవడం లేదు. రూ.12 కోట్లతో కూడిన బుగ్గవంక బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ పనులకు మోక్షమెప్పుడో తెలియడం లేదు.

పడకేసిన ప్రాజెక్టులు

జిల్లాలోని ప్రాజెక్టు పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లు రద్దుకు గురైనప్పటి నుంచి ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-1లో భాగమైన సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. జిల్లా నీటిపారుదలశాఖ రూ.212 కోట్ల ప్రతి పాదనల అనుమతుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. రూ.82 కోట్లతో కూడిన మైలవరం రిజర్వాయర్ ఆధునీకరణ ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు.

అందని పరిహారం

అన్నమయ్య, గండికోట, ఎస్‌హెచ్ నిర్వాసితులకు వేదన తప్పడం లేదు. గ్రీవెన్స్‌సెల్, స్పందన, ప్రజాసమస్యల పరిష్కార వేదికల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ ఎప్పటికి సాకారమవుతుందో తెలియడం లేదు. రెండేళ్ల కిందట అన్నమయ్య రిజర్వాయర్ గల్లంతైన ఘటనలో నష్టపోయిన వారికి ఎటువంటి న్యాయమూ జరగలేదు. ఐదు సెంట్లలో పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ అమలులో నిర్లక్ష్యం నెలకొంది. గండికోట నిర్వాసితులకు అదనపు పరిహారం కింద రూ.3.25 లక్షలు ఇస్తామన్న హామీ కాగితాలకే పరిమి తమైంది.రాయచోటి-వేంపల్లి-చాగలమర్రి, బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెతలు తప్పడం లేదు.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారు

స్వచ్ఛాంధ్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం మైదుకూరు పర్యటన ఖరారైంది. విజయవాడలో ఆయన ప్రారంభమైనప్పటి నుండి తిరిగి వెళ్లేంత వరకూ షెడ్యూల్‌ను సిఎం పేషి అధికారులు విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు ఆయన ఇంటి నుండి బయలుదేరి 11 గంటలకు విజయవాడ ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని 12 గంటలకు కడప ఎయిర్‌పోర్ట్‌కు రానున్నారు. అక్కడ నుండి హెలికాప్టర్ ద్వారా 12.10 గంటలకు మైదుకూరు కోర్టు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.20కి స్థానిక కెఎసి కల్యాణ మండపంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని అక్కడే విలేకరుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. 1 నుంచి 1.45 గంటల వరకు విశ్రాంతి తీసుకుని, 1.55కు బయలుదేరి ప్రొద్దుటూరు రోడ్డులోని వినాయకనగర్‌లోని గృహ సందర్శన నిర్వహించనున్నారు. 2.15 నుంచి స్వేచ్ఛాంధ్ర వాక్ నిర్వహిం చనున్నారు. 2.45కు పారిశుధ్య వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తారు. 3 గంటలకు స్వచ్ఛ సందర్శన, స్వచ్ఛఆంధ్రలో భాగంగా ఏర్పాటు చేయనున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించనున్నారు. 4 గంటలకు హెలిప్యాడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. 4.30కు హెలిప్యాడ్‌కు చేరుకొని కడపకు బయలుదేరి ,4.50 నుంచి కడప ఎయిర్పోర్ట్ నుంచి విజయవాడకు వెళ్ళనున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. అందుకు సంబంధించి కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, జిల్లా అధికారులు, టిడిపి జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనువాసులరెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వెంకటేష్, ముఖ్య నాయకులు ధనపాల జగన్, దాసరి బాబు, భీమయ్య, మునిశేఖర్‌రెడ్డి, గురివిరెడ్డి, మిల్లు శ్రీను, ఎపిరవీంద్ర, కిషోర్ కుమార్ రెడ్డి, జయభారత్ రెడ్డి, చిన్నా, ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

పటిష్టంగా 'ఆంధ్ర-స్వచ్ఛతా హీ సేవా' నిర్వహించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. శనివారం పరిసరాల పరిశుభ్రత పై ప్రజలను భాగస్వాములను చేస్తూ మానవహారాలు, ర్యాలీ, అవగాహన కార్యక్ర మాలు నిర్వహిం చాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో శుభ్రత కార్యక్ర మాలను అమలు చేసి చెత్త చెదారాలను తొలగించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలు, బహిరంగ స్థలాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహిం చి పరిసరాలను పరిశుభ్రం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛతా హీ సేవ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కూడా పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని అన్నారు. తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యాన వనాలు, ఆలయాలు, పర్యాటక కేంద్రాల సుందరీకరణ, బస్సు స్టాప్, మార్కెట్ ప్రదేశాలలో పరిశుభ్రత పనులు చేపట్టాలని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, చెత్త కుప్పలు, బోరు బావుల చుట్టుపక్కల మొదలగు ప్రదేశాల్లో మెగా శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఎంపిడిఒలు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇలు, విస్తరణాధికారులు, సంబంధిత అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. స్వచ్ఛతా హీ సేవ నిర్వహణలో ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు.ఇకపై ప్రతినెల మూడవ శనివారం జిల్లాలో స్వచ్ఛందర కార్యక్రమాలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున శ్రమదానం ద్వారా చెరువులు, కాలువలు, కుంటల వద్ద వ్యర్థపదార్థాలు తొలగింపు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా, స్వయం సహాయక సంఘాలు, ఎన్‌జిఒలను భాగస్వాములను చేసుకొని కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను, ఇతర శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయా లని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పీలేరు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని పీలేరు కార్మిక శాఖ అధికారి కెఆర్ ఆనందబాబు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పాన్ ఇండియా బాల కార్మికుల రక్షణ, పునావాస అవగాహనా ర్యాలీ నిర్వహించింది. పీలేరు పోలీసు, విద్య, వైద్య, శిశు సంక్షేమ, న్యాయ శాఖలు సమన్వయంతో స్థానిక గ్రేట్ విజన్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. పీలేరు పట్టణ, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు బాల కార్మిక నిర్మూలన, బాల కార్మిక చట్టం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ బాల కార్మికులను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. అలా ప్రోత్సహించే వారికి జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ అమలు అవుతాయని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతాల్లో బడి బయట పిల్లల శాతం తగ్గిందని ప్రతి ఒక్కరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలా బడికి పోకుండా ఇంకా ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే అందరినీ బడిలో ఉండేలా చేస్తామని తెలిపారు. స్థానిక శిశు సంక్షేమ శాఖ, గ్రేట్ విజన్ సొసైటీ ప్రతినిధి మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి బిడ్డ బడిలోనే ఉండాలని పేర్కొన్నారు. ప్రతి బిడ్డకూ సరైన పోషకాహారం అందించడం రాజ్యాంగం కల్పించిన హక్కని తెలిపారు. స్థానికులే కాకుండా వలస వచ్చిన వారు ఎవరైనా ఉంటే పునరావాసంతో పాటు విద్య, వైద్యం, ఇతర సౌకర్యాలను గ్రేట్ విజన్ సొసైటీ అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్‌తో పాటు అన్ని శాఖల సమన్వయకర్తలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు 'మేలుకొలుపు' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

కడపలోని డిఎస్ఆర్ కల్యాణ మండపం వేదికగా శనివారం రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో రజతోత్సవ వేడుకలు, 'మేలుకొలుపు' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు ఆచార్య కుప్పిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి సభాసమన్వయం చేయగా ముఖ్యఅతిథిగా రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, విశిష్ట అతిథిగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, ఆత్మీయ అతిథులుగా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, రాజంపేట, కమలాపురం ఎమ్మెల్యేలు మాధవి, ఆదినారాయణరెడ్డి, నంద్యాల వరదరాజులురెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీలు ఎం.వి.రామచంద్రారెడ్డి, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా హంస అవార్డు గ్రహీత డాక్టర్ నరాల రామారెడ్డి, ప్రముఖ చరిత్ర పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ జానపద పరిశోధకులు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి, యోగి వేమన విశ్వవిద్యాలయం సహ ఆచార్యులు కొవ్వూరు రామసుబ్బారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

తెలుగుగంగ ఎస్ఇగా విజయగోపాల్!

ప్రజాశక్తి-కడప ప్రతినిధి : తెలుగుగంగ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా విజయగోపాల్ నియమి తులయ్యారు. ప్రభుత్వం శుక్రవారం ఇరిగేషన్ ఇంజినీర్ల బదిలీలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఏడాది కిందటి నుంచి ఇప్పటి వరకు తెలుగు గంగ సూపరింటెండెంట్‌గా ఇరిగేషన్ రెగ్యులర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.వెంకటరామ య్య ఇన్‌ఛార్జి ఎస్ఇగా డిప్యూటేషన్ కింద చురుకుగా విధులు నిర్వ హిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన బదిలీ ఉత్తర్వుల నేపథ్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాధ్యతలకు పరిమితం కానున్నట్లు తెలుస్తోంది.


ఎఇఒ బ్రహ్మయ్యచారికి వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నాయకులు

ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయ తరలింపు ఆపండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం : వాల్మీకిపురం ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని తరలిస్తే వాల్మీకిపురం మండలంతో పాటు గుర్రంకొండ మండలంకు చెందిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వాల్మీకిపురం ఇఆర్ఒ కార్యాలయానికి వచ్చిన పీలేరు విద్యుత్‌శాఖ ఎఎఒ బ్రహ్మయ్యచారిని కలసి కార్యాలయ తరలింపుపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ గుర్రంకొండ మండల ప్రజలకు ఏవైనా విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తితే 50కిలో మీటర్ల మేర ప్రయాణించి కలికిరికి వెళ్లాల్సి వస్తోందని, అలాగే వాల్మీకిపురం మండల ప్రజలు 20కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోయారు. దీంతో విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి ఎఎఒ మాట్లాడుతూ ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకుడు సయ్యద్ బాష, మైనార్టీ నాయకులు సాధిక్, అషర్, ఇర్ఫాన్, హనీఫ్ పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ల ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ప్రజాశక్తి-రాయచోటి : ఉపాధ్యాయులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జూనియర్ లెక్చరర్స్ పదోన్నతులను ప్రభుత్వం వెంటనే చేపట్టేందుకు వీలుగా చొరవ చూపాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టిఎ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు రాష్ట్ర రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఉదయం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉపాధ్యాయుల పదోన్నతుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ గతంలో ఉన్న 40 శాతం జూనియర్ లెక్చరర్స్ పదోన్నతులను సీనియర్ స్కూల్ అసిస్టెంట్‌లతో వెంటనే భర్తీ చేయాలన్నారు. సర్వీస్ రూల్స్ లో ఉన్న చిన్న చిన్న లోపాలను సాకుగా చూపి 72 ,73 ,74 జిఒలు అమలు చేయని కారణంగా ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు జూనియర్ లెక్చరర్స్ ,డైట్ లెక్చరర్స్, ఉపవిద్యాశాఖ అధికారి వంటి పదోన్నతులు పూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. పదోన్నతులన్నీ వెంటనే ప్రత్యేక జిఒ ద్వారా గాని లేక ఆడహక్ రూల్స్ రూపొందిచైనా పదోన్నతులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపేలా కృషి చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలకు ప్రత్యేక చట్టం తీసుకురావడం హర్షించదగ్గ విషయమని అందులో బదిలీ అర్హతను జీరో సర్వీస్ తోపాటు విద్యా సంవత్సరాలను ప్రామాణికంగా తీసుకొని బదిలీలు జరపాలని కోరామన్నారు. ఎన్‌సిసి తో సమానంగా స్కౌట్ ఉపాధ్యాయులకు కూడా బదిలీల్లో ప్రాధాన్యతను కల్పించాలని మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, అర్చన విద్యాసంస్థల వ్యవస్థాపకులు మదన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు వేమన జయంతి

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'ప్రజాకవి' వేమన జయంతిని ఈ నెల 19న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, సభాధ్యక్షులుగా ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, విశిష్ట అతిథిగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రధానవక్తగా 'శతావధాని' ఆముదాల మురళి (తిరుపతి) పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు ఎస్.నాగముని వేమన పద్య పఠనం చేయనున్నట్లు పేర్కొన్నారు.


పెన్షన్ లబ్ధిదారులను పరిశీలిస్తున్న తనిఖీ బృందం

పింఛన్లు పరిశీలన

ప్రజాశక్తి-వాల్మీకిపురం : వాల్మీకిపురం మేజర్ పంచాయతీలో 31 మంది మానసిక, వికలాంగ లబ్ధిదారుల పింఛన్ స్థితిగతులపై శుక్రవారం పరిశీలన బృందం తనిఖీ చేసింది. లబ్ధిదారుల ఇండ్ల వద్దకు ఎంపిడిఒ మనోహరరాజు, ఇఒ రవీంద్రనాథ్, ప్రభుత్వ వైద్యులు ఆనంద్, మనోహర్ తదితరుల బృందం పర్యటించింది. లబ్ధిదారుడికి ఏ స్థాయిలో మానసిక, వికలత్వాన్ని పరిశీలించి, ప్రభుత్వం ఆర్థిక సహాయం సక్రమంగా అందుతుందా, లేదా అనే విషయాలను నమోదు చేసి ప్రభుత్వానికి పంపుతామని వారు తెలిపారు.

ఉపాధి హామీ ఎపిఒగా అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పీలేరు మండల ఎపిఒగా ఎం.అశోక్ రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం ఆయన పీలేరు ఉపాధి హామీ కార్యాలయంలో తన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎపిఒ మహేష్ తిరుపతి జిల్లా, ఎర్రవారిపాలెం మండలానికి బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా, వి.కోట మండలంలో ఏపిఓగా పనిచేస్తున్న అశోక్‌రెడ్డి బదిలీపై పీలేరు మండలానికి వచ్చారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట ఆధ్వర్యంలో శుక్రవారం చలికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైల్వే స్టేషన్ పరిసరాల్లోని యాచకులు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు నరసింహ రాజు, జిల్లా చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు, జోన్ చైర్మన్ సుబ్రహ్మణ్యం రాజు, మాజీ రీజన్ చైర్మన్ మద్దిపట్ల రామకృష్ణ నాయుడు, మాజీ జోన్ చైర్మన్ ఆరే వెంకటసుబ్బయ్య నాయుడు, మాజీ కార్యదర్శి దండే రవికుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆపన్న హస్తంగా లయన్స్ క్లబ్ సేవ చేయడంలో ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. చలికాలంలో తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేయడం సంతృప్తిగా ఉందని తెలిపారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : స్థానిక పట్టణంలోని గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్‌వి రమణ ఆధ్వర్యంలో శుక్రవారం గీతాంజలి డిగ్రీ కళాశాలలో బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌వి యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.వి.రమణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో బలిజ కులస్తుల రాజకీయ, విద్యా సంస్థలు, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో తిరుపతి వేదికగా ఆరు జిల్లాల బలిజ కులస్తుల 100వ సమావేశంలో బలిజలు పెద్ద ఎత్తున పాల్గొని సమస్యల పరిష్కార సాధన దిశగా ప్రయాణిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ తోట రామయ్య, పోకల ప్రభాకర్, వెంకట రాజంపేట సుధాకర్, గుగ్గిళ్ళ చంద్రమౌళి, అబ్బిగారి గోపాల్, చంద్రశేఖర్, నాగేంద్ర, మలిశెట్టి సుబ్బరాయుడు, శ్రీనివాసులు, రామా శ్రీనివాసులు, నందలూరు రెడ్డయ్య పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న బలిజలు

గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 26న స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జరిగే 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో కన్నుల పండుగగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకలలో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల న్నారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వేదికను అందంగా అలంకరిం చాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిధులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని తెలిపారు. ప్రోటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు అందరికీ పంపించాలన్నారు. పెరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండుగ సాగేలా సంసిద్ధం చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు పెరేడ్ మైదానంలో షామియానా, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆర్‌డిఒ, తహశీల్దార్, మునిసిపల్ కమీషనర్‌లకు సూచించారు. జాతీయ జెండా ఎగరవేయుట, వేదిక అలంకరణ, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీటి ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల జారీ, ప్రోటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు పంపిణీ తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు జారీ చేశారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు స్నాక్స్, వాటర్ బాటిల్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎఎస్‌పి వెంకటరత్నం, డిఆర్ఒ మధుసూదనరావు, ఆర్‌డిఒ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయికిషన్‌రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిట్వేలి

సిఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో పలు గ్రామాలలో పర్యటించి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి, టిడిపి యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డితో కలిసి సిఎం సహాయనిధి చెక్కులను బాధితుల నివాసం వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని వెంకటాపురంపల్లి, నేతివారిపల్లి గ్రామాలలో పర్యటించి రూ. 4.27లక్షలు సిఎం సహాయనిధి చెక్కులను స్వయంగా బాధితుల నివాసం వద్దకే వెళ్లి అందించినట్లు తెలిపారు. మండలంలోని నగిరిపాడు గ్రామంలో నివాసమున్న తిమ్మారెడ్డి కిషోర్‌రెడ్డికి రూ.2,38,860లు, వెంకటాపురంపల్లికి చెందిన తతిరెడ్డి గోపీకి రూ.1,89,312లు చెక్కును అందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, అర్హులైన లబ్దిదారులు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రాజు కుంట సర్పంచ్ గుత్తి నర్సింహులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : ప్రజా శ్రేయస్సుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అని టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణ ఆచారి పేర్కొన్నారు. 20వ వార్డు పరిధిలో త్యాగరాజ వీధిలో నివాసముంటున్న సయ్యద్ ఖాదర్ బాషా, నసీర్‌జాన్ కుటుంబం సభ్యులు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. వారిది పేద కుటుంబం కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.25 వేల చెక్కును స్థానిక నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారితో కలసి ఎమ్మెల్యే వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయడం జరుగుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే సీయం సహాయ నిధి నుండి ఆయా కుటుంబాలను ఆదుకొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇంతియాజ్, సంగం రమేష పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు శిక్షణ తరగతులు

- మండల ఉద్యాన శాఖ అధికారి వనిత

ప్రజాశక్తి-సుండుపల్లి



మండలంలోని ఈడిగపల్లి సమీపంలో గల మామిడితోటలో శనివారం ఉదయం 10.30 గంటలకు శాస్త్రవేత్తలతో మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యాశాఖ అధికారి వనిత తెలిపారు. మామిడిలో పూత, పిందె సమయంలో తీసుకోవలసిన చర్యల పైన రైతులకు వివరిస్తారని తెలిపారు. మామిడిలో పూత దశ ఒక నెల కాలం పడు తుందని డిసెంబర్ ఆఖరు నుంచి జనవరి ఆఖరు వరకు ఉంటుందని చెప్పారు. ఈ దశలో పంటను ఎలా రక్షించుకోవాలని రైతులకు తెలియజేస్తామని అన్నారు. మామిడిలో అధిక నష్టం కలిగించే చీడలలో తేనెమంచు పురుగు, కాయపుచ్చు పురుగు, పిండినల్లి, టెంకపురుగులు, కాండం తొలుచు పురుగు, చెదల పురుగుల నివారణకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలం లోని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఐటి రంగంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఐటితో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-కలకడ

ఐటితో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపల్ మలంగ్ షా వలి పేర్కొన్నారు. మండలం లోని స్థానిక ఆదర్శ పాఠశాలలో పది రోజులపాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐటి రంగంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ వల్ల వర్కింగ్ స్కిల్స్ పెంపొందించుకునేందుకు అవ కా శాలు మెండుగా ఉన్నాయని సూచించారు. పది రోజులపాటు శిక్షణ పొందే విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని తెలిపారు.

కోర్టుకు హాజరైన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : గత వైసిపి ప్రభుత్వంలో వైసిపి నాయకుల అరాచకాలను అడ్డుకున్నందుకు మాపై తప్పుడు కేసులు బనాయించడంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని టిడిపి నాయకులు ఆవేదనవ్యక్తం చేశారు. శుక్రవారం మదనపల్లిలో వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా సొంత పనులు, ప్రజాసేవ మానుకొని కోర్టు చుట్టూ వాయిదాలకు తిరగడం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, రాజంపేట పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్యదర్శి యాదగిరి దొరస్వామి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ ప్రభాకర్, నాగూర్‌వలి, మాజీ సర్పంచ్ రెడ్డప్ప, ఉప సర్పంచ్ లక్ష్మన్న, హసీనా కోర్టు వాయిదాకు హాజరయ్యారు. వైసిపి మాదిరిగా సిఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహ రించదని అన్నారు.

గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి : పీడీ

ప్రజాశక్తి-రామాపురం

గోకులాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బండపల్లి పంచాయతీలోని వెంకటరెడ్డిగారిపల్లి గ్రామంలో రైతులు ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటుచేసిన గోకులం షెడ్లను, సిమెంట్ రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గోకులం షెడ్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని రైతులను కోరారు. ప్రతి పాడి రైతుకు షెడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మండలంలో మొత్తం 74 గోకులాల మంజూరు కాగా అందులో 51 వరకు పూర్తి చేశారని పేర్కొన్నారు. 14 బేస్ మట్టం లెవెల్లో, 10 రూఫ్ లెవెల్లో ఉన్నాయని తెలిపారు. మిగిలినవి ఈనెల ఆఖరులోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ పెంచలయ్య, ఇసి శివయ్య, టిఎ బాబు, ఎఫ్ఎ సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డిగారిపల్లిలో పర్యటిస్తున్న పీడీ వెంకటరత్నం

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి



కృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న యల్లటూరు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శుక్రవారం పాత బస్టాండ్‌కూడలిలోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యల్లటూరు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ తెలుగు భాష, జాతి, వైభవాన్ని, ప్రపంచం నలుమూలలకు తెలియజెప్పిన విజయనగర సామ్రాజ్య వీరులు శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, పట్టణ యువత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలో శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి గుడి ఆవరణంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు నవ్యాంధ్ర కాపు బలిజసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షులు కడియాల వెంకటప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు సుపరిపాలన అందించడమే కాకుండా, ఈయన పాలనలో రత్నాలును రాశులుగా పోసి అమ్మేవారిని కొనియాడారు. మంచి కవిగా , రచయితగాను, కళాకారుడు గాను, బహుముఖ ప్రజ్ఞ శాలి గా పేరుగడించారని అన్నారు. పేద ప్రజల కోసం అనేక చెరువులు బావులు తటాకాలు తవ్వించి పేదల దాహార్తిని తీర్చారని అన్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర కాపు బలిజ సంఘం కోశాధికారి యనమల విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీకాంత్, గంట వెంకట కృష్ణయ్య, మిగతా నవ్యాంధ్ర కాపు బలిజ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణ దేవరాయుల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నవ్యాంధ్ర కాపు బలిజసంఘం నాయకులు

హైకోర్టు ఉత్తర్వులతో మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపిపి దస్తగిరి

- వైసిపి నాయకుల హర్షం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

హైకోర్టు ఉత్తర్వుల మేరకు తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోటమండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వసభ్య సమావేశానికి జడ్‌పిటిసి బైసాని జ్యోతి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి దస్తగిరి, వైస్ ఎంపిపిలు రమణారెడ్డి, భూదేవి, కో-ఆప్షన్ నెంబర్ యాసానుల్లా, ఎంపిటిసిలు ఆనంద రెడ్డి, రవీంద్రారెడ్డి, నిర్మల విశ్వేశ్వరరెడ్డి, నరసమ్మ నరసింహులు, తదితర ఎంపిటిసిలు హాజరై మండల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. గతంలో రెండు మూడు పర్యాయాలు కూటమి నాయకులు మండల సర్వసభ్య సమావేశం జరుగుకుండా అడ్డుకున్నారు. దీంతో వైసిపి నాయకులు హైకోర్టును ఆశ్రయించగా,హైకోర్టు ఉత్తర్వుల పోలీసు బందోబస్తు నడుమ మండల సమావేశం సజావుగా జరిగింది.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండల తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారుల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలనలో అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో ఉందని,రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. 45 రోజులు ఉన్న కాలపరిమితి అర్జీలు అధికం కావడంతో 90 రోజులకు పెంచామన్నారు. మదనపల్లి, బి .కొత్తకోట మండలాల్లో అత్యధికంగా అర్జీలు వచ్చాయని, కచ్చితంగా అన్ని అర్జీలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. రీసర్వే ప్రక్రియను 20వ నుంచి ప్రారంభిస్తామని పైలెట్ ప్రాజెక్టుగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని రీసర్వే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండలంలోని బయ్యప్పగారి పల్లి పంచాయతీ నందు పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తామని తెలిపారు.ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో అధికారులు అందరూ పాల్గొనాలని తెలిపారు. ముఖ్యంగా ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పూర్తి బాధ్యత వహించాలని అన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

కొత్త సంవత్సరంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు దీనికి అందరూ సహకరించాలని కోరారు. ే ఓషన్ దుకాణాల కొరకు దరఖాస్తు చేసిన వారి సంఖ్య అధికంగా ఉండటంతో వచ్చే వారంలో అందరిని ఇంటర్వ్యూకు పిలుస్తామని వచ్చే నెల మొదటి వారంలోగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు.

21 నుంచి మెడికల్ పెన్షన్ల తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలో ఈనెల 21వ తేదీ నుంచి మూడు రోజులపాటు మెడికల్ పెన్షన్ల తనిఖీ జరుగుతుందని ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి తెలిపారు. కడప జిల్లా నుండి ముగ్గురు అధికారుల బృందం తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. 21న కుక్కరాజుపల్లి, కోటకొండ, రేణిమాకులపల్లె, కన్యమడుగు, ఎద్దుల వారి పల్లెల్లో 29 పెన్షన్లు పరిశీలిస్తారని చెప్పారు. 22న కొసు వారిపల్లె, బాల్ రెడ్డిగారిపల్లె, తంబళ్లపల్లె-1 లలో 29 పెన్షన్లు, 23వ తేదీన గుండ్లపల్లె, చేల్లూరి వారిపల్లె, గోపిదీన్నే, కొట్టలలో 31 పెన్షన్లు తనిఖీ నిర్వహించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతారని తెలిపారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచాలి : ఎపిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెంచాలని ఎపిడి మధుబాబు ఆదేశించారు. శుక్రవారం స్త్రీశక్తి భవన్లో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలోనూ కూలీలను గ్రూపులుగా చేసి పనులు కల్పించాలన్నారు. ఒక్కొక్క గ్రూపులో 10 నుంచి 30 మంది వరకు కూలీలను చేర్చాలని తెలిపారు. కూలీలు కోరిన వెంటనే పనులు చూపి జరిగిన పనులకు సకాలంలో కొలతలు తీసి బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.మండలంలో చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ నెలలో మరో 10 గోకుల షెడ్ల నిర్మాణానికి నివేదికలను పంపుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎపిఒ అంజనప్ప, ఉపాధి ఇంజనీర్ రామన్న, మండల టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

'మిట్స్'లో దిల్‌రుబా సినిమా పాట ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం 5 గంటలకు కళాశాలలో హీరో కిరణ్ అబ్బవరం నూతన సినిమా దిల్ రుబా సినిమా సాంగ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. ఈ కార్యకామానికి ముఖ్య అతిథిగా హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రుక్సార్ ధిల్లాన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు : ఎంవిఐ

ప్రజాశక్తి-పీలేరు



మాట్లాడుతున్న ఎంవిఐ విజయకుమారి

రోడ్డు ప్రమాదాలను నివారిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చే బాధ్యత మనపై ఉందని పీలేరు మోటారు వాహనాల తనిఖీ అధికారిణి విజయ కుమారి తెలిపారు. స్థానిక ఆర్‌టిసి గ్యారేజ్‌లో శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవ ప్రారంభ కార్యక్రమానికి ఎంవిఐ అధికారిణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ డ్రైవరు సోదరులు తగినంత విశ్రాంతి తీసుకోవాలని, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని , వాహనాలు నడిపే సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని సూచించారు. ముఖ్యంగా ఏకాగ్రత, అప్రమత్త చాలా అవసరమని, బస్సులు నడుపుతూ ప్రయాణీకులను క్షేమంగా వారి గమ్యస్థానాలుకు చేర్చాలని అన్నారు. సంస్థ అందిస్తున్న "సురక్షితం, సుఖవంతం, శుభప్రదం" నినాదాన్ని అనుసరిస్తూ ప్రయాణికులను వారి గమ్యాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రతి డ్రైవ రుకూ ఉందని గుర్తుంచుకుని వాహనాలను నడపాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బండ్ల కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ, గ్యారే జ్ సూపర్‌వైజర్ హబీబుల్లా, స్టోర్ సూపర్‌వైజర్ బాలసుబ్రమణ్యం, సెక్యూ రిటీ హెడ్ కానిస్టేబుల్ డిఎస్‌పి రెడ్డి, గ్యారేజ్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.



పునుగు పిల్లిని అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

పునుగు పిల్లి ప్రత్యక్షం

- అటవీ శాఖ అధికారులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రం రామాపురంలోని లక్కిరెడ్డిపల్లి మార్గంలో శుక్రవారం రోడ్డు ప్రక్కన వెళుతున్న కొందరు అంతరించి పోతున్న జాతులకు చెందిన పునగు పిల్లిని గుర్తించిపోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీసులు ఆ పునుగు పిల్లిని పోలీసు స్టేషన్‌కు తీసుక వచ్చి అటవీశాఖ అధికా రులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు స్టేషన్‌ను వచ్చి పునుగు పిల్లిని తీసుకొని సమీపంలోని పాలకొండల్లో వదలివేయనున్నట్లు తెలిపారు.

చిలకవారిపల్లెకు దారి సౌకర్యం కల్పించండి

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మహిళల నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కొత్తవారిపల్లి పంచాయతీ, చిలకవారిపల్లికి దారి సౌకర్యం కల్పించాలంటూ శుక్రవారం గ్రామ మహిళలు సుమారు 20 మంది సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి నుండి పల్లెల్లోకి వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం ఉందని, అయితే దారి సౌకర్యం లేకపోవడంతో ఆటోలు, పాఠశాల వ్యాన్లు, అంబులెన్స్ గ్రామంలోకి వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పల్లెకు దారి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆ భూమి పట్టా కావడంతో భూహక్కుదారులు దారిని మూసివేశారని అన్నారు. దీంతో చేసేదిలేక గ్రామస్తులు నడిచి వెళ్లాల్సి వస్తోందని, దీనిపై సబ్ కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చిలకవారిపల్లెకి దారి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి అందించారు.



ఆర్‌జెడి శామ్యూల్‌ను సన్మానిస్తున్న సేతు

ఆర్‌జెడి శామ్యూల్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కర్నూలు జిల్లా డిఇఒగా పనిచేస్తూ ఆర్‌జెడిగా పదోన్నతి పొంది శుక్రవారం కడపలో రాయలసీమ జిల్లాల ప్రాంతీయ విద్యా సంచాలకులుగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కె.శామ్యూల్ ను మదనపల్లె విజయభారతి విద్యాసంస్థ ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సేతు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయివేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆర్‌జెడికి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా కె.శామ్యూల్ కు జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ విద్యాశాఖలోశామ్యూల్ సమర్ధతను గుర్తించి ప్రభుత్వం ఆర్‌జెడిగా నియమించడం శుభ పరిణామమన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ముస్లిములకు ఆత్మీయ విందు

ప్రజాశకి-రాజంపేట

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని యల్లమ్మ ఆలయం సమీపంలోని యల్లటూరు భవన్‌లో యల్లటూరు శ్రీనివాసరాజు ముస్లిం సోదరులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలకు హిందూ, ముస్లింలు ఒకరికొకరు పరస్పరం ఆహ్వానించుకొనే సంప్రదాయం మన ప్రాంతంలో ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు మత సామరస్యంతో నడుచుకోవాలని తెలిపారు. ముస్లిము సోదరులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని ట్రాన్స్ కో ఇఇ గంగాధరం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పెంచలకోన పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో శ్రీ శాంతి లింగేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవారం అత్యంత వైభవంగా శ్రీ ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం పెంచలకోన ఆగమ పండితులు వినోద్ స్వామి బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శనివారం ఉదయం పుల్లంపేట మెయిన్ బజార్‌లో శ్రీ కోదండరామస్వామి దేవస్థానం, లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణం వద్ద నుంచి 20వ మహా పాదయాత్ర ప్రారంభం అవుతుందని నర్సింగ్‌కుమార్ తెలిపారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

క్రైం కార్నర్

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భార్య కాపురానికి రాలేదని భర్త ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తాలూక ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని బసినికొండ, రామాచార్లపల్లెలో కాపురం ఉంటున్న శంకర(38) భవన కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇటీవల భార్య లక్ష్మి అలిగి పుట్టింటికి వెళ్ళింది. రెండు నెలలు కావస్తున్న తిరిగి కాపురానికి రాలేదని, ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమించడంతో డాక్టర్ల సలహా మేరకు తిరుపతి రుయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.